క్లుప్తంగా

ఆర్థికంగా ఎదగాలి



ఐచర్ వాహనాన్ని అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చెప్పారు. దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజక ప్రోత్సాహం పథకం కింద మంజూరైన ఐచర్ వాహనాన్ని శనివారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి సర్కారు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. సబ్సిడీపై వాహనాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలమ్మ, ఎఫ్‌డీఓ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎరుకలి రాజు

కృష్ణగిరి: ప్రతి పౌరుడికి తమ హక్కులపై అవగాహన ఉండాలని, హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సభ్యుడు ఎరుకలి రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో ఆర్ఐ మస్తాన్ అధ్యక్షతన పౌర హక్కుల పరిరక్షణ దినం నిర్వహించారు. ఆర్ఐతోపాటు డీవీఎంసీ సభ్యుడు, సభకు హాజరైన అతిథులు ఏఎస్ఐ గణేశ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ రామస్వామి పౌర హక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సమావేశంలో వీఆర్ఓ మైమున్నిసా, గ్రామ సర్వేయర్ హరి పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకుంటాం

వెల్దుర్తి: స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద రహదారిపై శనివారం ఉద్దేశపూర్వకంగా చెత్త వేసి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగజేసిన వారిపై చర్యలు తీసుకుంటామని మేజర్ పంచాయతీ సర్పంచ్ ముత్యాల శైలజ అన్నారు. జెడ్పీటీసీ సుంకన్న, వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మన రవిరెడ్డి, వెంకట్‌నాయుడు, పత్తికొండ మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్ గట్టు ఆరిఫ్, సచివాలయ కన్వీనర్ నాగిరెడ్డితో కలిసి ఆమె తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అనంతరం నడిరోడ్డుపై చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నదికైరవాడిలో పొలంబడి

నందవరం : పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఏఓ మత్రి స్రవంతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామంలోని వైఎస్సార్ పొలంబడి సదుపాయ కర్త రైతు సురేష్ పొలంలో వ్యవసాయ అధికారులు క్షేత్ర దినోత్సవం నిర్వహించి వరి పంటపై పంటకోత ప్రయోగం చేపట్టారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రభావతి, సురేంద్రగౌడ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆనంద్‌బాబు

నందవరం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దేవసహాయం, ఆనంద్‌బాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తకై రవాడి గ్రామంలో ప్రధాన రహదారి నుంచి ఎంపీపీ స్కూల్ ఎదుట ఏర్పాటు చేసిన కేవీపీఎస్ జెండాపోల్ వరకు ఆ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్ద ఆనందరాజుతో జెండా ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంటరానితం నేరమని, కుల వివక్ష వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం కేవీపీఎస్ నాయకులు నదికైరవాడి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆంథోని,నాగప్ప,రాజా రమేష్, గుంటిప్ప తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని కోతిరాళ్ల, దూదేకొండ గ్రామ సచివాలయాలను శనివారం ఎంపీడీఓ పార్థసారధి, డీఎల్‌పీఓ శ్రీకాంత్‌చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను తెలుసుకుని హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అతిసారం.. అప్రమత్తం

- ఆలూరు, హొళగుంద మండలాల్లో పలువురికి వాంతులు, విరేచనాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాగం
- గ్రామాల్లో హెల్త్‌క్యాంపుల ఏర్పాటు
- తాగునీటి ట్యాంకుల శుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న అతిసారం బాధితులు

ఆలూరు రూరల్: గ్రామాల్లో అతిసారం (డయేరియా) ప్రబలుతోంది. వివిధ కారణాలతో ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, హొళగుంద మండలాల్లో వారం రోజుల నుంచి ప్రజలు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. పలువురు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. సమస్య తీవ్రం మవుతుండటంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. హొళగుంద మండలంలోని నెరణికి, నెరణికి తండా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. డాక్టర్లు ఆయా గ్రామాల్లోనే ఉండి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. తాగునీటి సరఫరా అధికారులు, పంచాయతీ అధికారులను అప్రమత్తం చేసి ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యలోపం లేకుండా వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. వ్యాధి ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలని, చిన్న పిల్లలు,వృద్ధులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

24 గంటలూ వైద్య సేవలు

వాంతులు, విరేచనాలతో వస్తున్న రోగులకు సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని కోలుకునేవరకు పర్యవేక్షిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే వారిలో వృద్ధులు చిన్న పిల్లలు అధికంగా ఉన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఇప్పటి వరకు 32 మంది డయేరియా లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు వైద్యులు చెప్పారు. నెరణికి గ్రామంలో ఒకే ఇంట్లో నలుగురు డయేరియాతో ఆస్పత్రిలో చేరారు. బుధవారం డీఎం అండ్ హెచ్ఓ రామగిడ్డయ్య నెరణికి గ్రామంలో పర్యటించారు. తీవ్రమైన ఎండలు, కలుషితమైన తాగునీరు, ఆహారంతో డయేరియా వ్యాధి సోకుతున్నట్లు వెల్లడించారు. బాధితులు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.



నెరణికిలో తాగునీటి ట్యాంక్ శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు



నెరణికిలో గ్రామస్తులకు ఆరోగ్య సూచనలు ఇస్తున్న డీఎం అండ్ హెచ్ఓ రామగిడ్డయ్య (ఫైల్)

డయేరియా వ్యాధి లక్షణాలు..

- తీరిక లేకుండా నీళ్ల విరేచనాలు
- విపరీతమైన కడుపునొప్పి
- ఆహారం జీర్ణం కాకుండా వాంతులు
- బీపీ పూర్తిగా తగ్గిపోవడం
- షుగర్ లెవల్స్ పడిపోతాయి
- చర్మం మొత్తబడిపోతుంది
- తీవ్ర నీరసం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఎండలు ఉన్నప్పుడు బయటికి వెళ్లరాదు
- వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలి
- బీపీ,షుగర్ పడిపోకుండా చక్కెర, ఉప్పు కలిపిన నిమ్మరసం తీసుకోవాలి
- రోజుకు 4–5 లీటర్ల నీరు తాగాలి
- పళ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలి
- ఎక్కువగా మజ్జిగ అన్నాన్ని ఆహారంగా తీసుకోవాలి

అప్రమత్తంగా ఉండాలి



తీవ్రమైన ఎండలు, కలుషిత నీరు తాగడంతో డయేరియా సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి విరేచనాలు, వాంతులు అవుతాయి. ప్రతి రోజు రెండు నుంచి మూడు కేసులు నమోదవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. వేడిచేసి చల్లార్చిన నీరు తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. ఎండలకు తిరగరాదు. రోజుకు 5 లీటర్ల నీరు తాగాలి. చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– లక్ష్మీనారాయణ, సీహెచ్‌సీ వైద్యుడు, ఆలూరు

విద్యా సమాచారం

● గురుకుల పరీక్షల్లో ప్రతిభ



ధరణీధరరెడ్డి



సాయిచరిత

మద్దికెర: మహాత్మా జ్యోతిరావుపూలే సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కోచింగ్ నిర్వాహకులు పక్కీరప్ప శనివారం తెలిపారు. బొజ్జనాయునిపేట గ్రామానికి చెందిన ధరణిదరరెడ్డి 50 మార్కులకు గాను 47 మార్కు లు, అలాగే సాయిచరిత అనే విద్యార్థిని 44 మార్కులు సాధించినట్లు తెలిపారు.

నోటీస్ బోర్డు

● 'మిషన్ వాత్సల్య' దరఖాస్తుకు నేడు ఆఖరు

తుగ్గలి : అనాథ పిల్లల సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 'మిషన్ వాత్సల్య' పథకానికి ఆదివారంతో గడువు ముగుస్తుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్‌ఎం బాషా తెలిపారు. 18 సంవత్సరాలలోపు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, సంరక్షణ లేని పిల్లలు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ పథకం కింద ఎంపికైన పిల్లలను నెలకు రూ.4 వేలు చొప్పున అందిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు సంవత్సర ఆదాయం రూ.72వేలు ఉండాలన్నారు. ఆదివారం సాయంత్రంలోగా అన్ని వివరాలతో కూడిన దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసులకు లేదా అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేయాలని సూచించారు.

జనం జగన్ పక్షం



వెల్దుర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: ప్రజలు మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలంటున్నారని, ఇందుకు తాము నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి లభించిన స్పందనే ఉదాహరణ అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులతో కలిసి మండల సొసైటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.ఈనెల 7న ప్రారంభమై న జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం ద్వారా తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు,సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ని యోజకవర్గంలో 79,036 కుటుంబాలను కలిసి వారి అభిప్రాయాలు సేకరించారన్నారు. అత్యధికులు ప్రభుత్వ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. 60,402 మంది మిస్డ్ కాల్ ఇచ్చి జగనన్న పాలనకు జై కొట్టారన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అన్న ప్రజల మాటలు ప్రతిపక్ష పార్టీలకు చెంపపెట్టు అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు.మెగా సర్వేలో పాల్గొన్న తమ ప్రజాప్రతినిధులు, నాయకులు, కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లను ఆమె అభినందించారు.

చంద్రబాబు, లోకేష్‌ను ఎవరూ నమ్మరు

టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ చేస్తున్న యాత్రలు అట్టర్‌ఫ్లాప్ అవుతున్నాయని, వారిని ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175సీట్లు గెలవడం ఖాయమని చెప్పారు. సమావేశంలో వెల్దుర్తి, తుగ్గలి, పత్తికొండ మండలాల కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, జిట్టా నగేశ్, కారం నాగరాజు, వెల్దుర్తి, తుగ్గలి సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్‌లు సమీర్ కుమార్ రెడ్డి, హనుమంతు, వెల్దుర్తి, తుగ్గలి జెడ్పీటీసీలు సుంకన్న, పులికొండ నాయక్, పత్తికొండ ఎంపీపీ నారాయణదాసు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ టీఎండీ హుసేన్, జిల్లా నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, పత్తికొండ శ్రీరంగడు, రాతన మోహన్ రెడ్డి, వెల్దుర్తి వ్యవసాయ సలహామండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, కృష్ణగిరి సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాధవరావ్, డైరెక్టర్ వెల్దుర్తి ఆరిఫ్, పత్తికొండ వైస్ ఎంపీపీ బలరాముడు, తుగ్గలి కో–ఆప్షన్ మెంబర్ చాంద్‌బాషా, వెల్దుర్తి, నార్లాపురం సర్పంచ్‌లు ముత్యాల శైలజ, కోటిరెడ్డి, హోసూరు, వెల్దుర్తి పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం

హొళగుంద: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న మతోన్మాద బీజేపీ పార్టీని సాగనంపుదామని సీపీఐ మండల సహాయ కార్యదర్శులు పెద్యాట మారెప్ప, రంగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాట శ్రీరంగ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఎల్లార్తి, చిన్నహ్యాట, బీజీ హళ్లి గ్రామాల్లో రెండవ రోజు ప్రచార భేరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పాలనలో కార్మికులు, రైతులు, కూలీలు దుర్భర పరిస్థితిని అనుభవిస్తున్నారని వాపోయారు. ప్రధాని మోదీ వంటగ్యాస్, నిత్యావసర ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో నాయకులు సలాంసాబ్, మౌలాసాబ్, ఇనాహిత్, వెంకన్న, నూర్‌బాషా, మస్తాను, అశోక్, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల ఆదాయమే లక్ష్యంగా పని చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపుదామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్ పిలుపునిచ్చారు. కృష్ణగిరిలో శనివారం ఆయన పార్టీ మండల కార్యదర్శి ఖలీల్ బాషా ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీల సేవలో నిమగ్నమై ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణానికి నిధులు విడుదల చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీ ప్రజలను మోసం చేస్తుందన్నారు. అలాగే ధరలు నియంత్రించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శులు వెంకటరాముడు, దస్తగిరి, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు



ఆలూరు ప్రభుత్వ బాలుర–1 సెంటర్‌లో ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఆలూరు రూరల్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం ఆలూరులో ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ బాలుర–1, బాలుర–2 పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాలుర–1 కేంద్రంలో 288 మంది విద్యార్థులకు గాను 246 మంది హాజరయ్యారు. బాలుర–2 సెంటర్‌లో 226 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 196 మంది పరీక్షలు రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్‌లు రమణయ్య, కరిబసప్ప తెలిపారు. రెండు సెంటర్లలో కలిసి 514 మందికి గాను 442 హాజరయ్యారు. 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నవోదయ ప్రవేశ పరీక్షలను ఆలూరు తహసీల్దార్ విజయ్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి సెంటర్ల వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలను తహశీల్దార్ జయన్న పరిశీలించారు.

సంక్షేమ పాలనకే ప్రజా మద్దతు

- జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన
- ఎమ్మిగనూరు నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు పలుకుతున్నారని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైఎస్ఆర్‌సీపీ పీపుల్స్ సర్వేలో 1.45 కోట్ల మంది వైఎస్సార్‌సీపీకి జైకొట్టారన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలో జగన్ సర్కారుకు అనుకూలంగా తమ అభిప్రాయాలు చెప్పారన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 94,881 కుటుంబాలుండగా తమ పార్టీ శ్రేణులు 83,769 కుటుంబాలను కలిసినట్లు తెలిపారు. 67.23 శాతం పార్టీ టోల్ ఫ్రీ నెంబర్‌కు మిస్డ్‌కాల్స్ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్ కులం,మతం చూడకుండా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. లబ్ధిపొందిన ప్రతి కుటుంబం తమ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారన్నారు. పీపుల్స్ సర్వేలో పాల్గొని ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్న పార్టీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్ఆర్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజా మద్దతు చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులకు ముందుగానే ఓటమి భయం పట్టుకుందన్నారు. గతంలో ప్రధాని మోదీని తిట్టిన చంద్రబాబునాయుడు ఎన్నికల కోసం మళ్లీ ఆయన జపం చేస్తున్నారన్నారు. పొత్తులు లేనిదే పోటీ చేయలేని దుస్థితిలో టీడీపీ ఉందని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు బీజేపీ అగ్రనేత అమిత్ షాపై అలిపిరి వద్ద రాళ్ల దాడి చేయించిన చరిత్ర ప్రతిపక్ష నేత చంద్రబాబుదన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్ అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూశే రాజశేఖర్, సచివాలయ జేసీఎస్ కన్వీనర్లు షబ్బీర్ అహమ్మద్, బంగిశ్రీరాం, చాంద్‌బాషా, మనోహర్‌రెడ్డి, ముగతి విరూపాక్షిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

1నుంచి వేసవి సెలవులు

తుగ్గలి:మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు మే1వ తేదీ నుంచి వేసవి సెలవు లు ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈవో రామవెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం లాస్ట్ వర్కింగ్ డేగా ప్రకటించారన్నారు. చివరి రోజు హెచ్‌ఎంలు తల్లిదండ్రులను పాఠశాలలకు పిలిచి వారి పిల్లల మార్కులు, గ్రేడ్లు, హాజరు తదితర వివ రాలు ఉన్న ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తార న్నారు. సెలవుల అనంతరం జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు.

వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురండి

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు సుధ నాయుడు కోరారు. ఈ అంశంపై శనివారం ఆ పార్టీ నాయకులు గోనెగండ్లలోని వాటర్ ప్లాంట్ దగ్గర నిరసన తెలిపారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు ఓబులేష్, విక్రమ్, దస్తగిరి, రామకృష్ణ, యుగంధర్, నరేంద్రగౌడ్, ధనరాజ్, పులికొండ, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

తుగ్గలి: వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రు లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు మల్లికార్జున, రామాంజినేయులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లే యువకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదే విధంగా ఎండలు విపరీతంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మేడేను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, సోమేశ్వర సర్కిళ్ల వద్ద మేడే కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేడేలో భాగంగా సోమవారం బాలికల హైస్కూల్ నుంచి భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నన్న, ఏఐటీయూసీ నాయకులు సుంకన్న, నరసింహులు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

మద్దికెర: ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఉపాధి పనులు చేసే కూలీలు పనులు చేసేటప్పుడు తాగేనీటిలో ఓఆర్ఎస్ కలుపుకుని తాగితే మంచిదని ఏఎన్ఎం గాయత్రి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఉపాధి కూలీలకు ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శరీరంలో నీటి స్థాయి నింపడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎండలకు నీటిని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కూలీలు ఎండలో పనులు చేయడం ద్వారా చెమట రూపంలో డీహైడ్రేషన్ వస్తుందని అందువల్ల ఓఆర్ఎస్ పౌడర్‌ను నీటిలో కలుపుకొని తాగాలన్నారు.

ఇంటి వద్ద చదివించాలి

గోనెగండ్ల: వేసవి కాలంలో పిల్లలను ఇంటి వద్ద చదివించాలని ఎంఈఓ వినోద్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులు సూచించారు. శనివా రం మండల కేంద్రం గోనెగండ్లలోని మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రగతి నివేదికలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ప్ర భుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిందన్నారు. సమయం వృథా చేయకుండా పిల్లలకు చదువుపై ఆసక్తి పెంచాలన్నారు. అలాగే కంప్యూటర్ సంబంధ కోర్సుల్లో శిక్షణ కల్పించాలన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

వెల్దుర్తి: రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు మే 3వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ అక్బర్ బాషా తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని రత్నపల్లె, నర్సాపురం, లక్ష్మీనగరం గ్రామాల ఆర్బీకేలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పరిశీలించి అందిస్తున్న సేవల వివరాలు ఆర్బీకే సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి ఈనాము, దేవాదాయ భూములు, అటవీ భూములు సాగు చేసేవారు, అగ్రిమెంట్లు కలిగిన వారు సైతం అర్హులన్నారు.

అక్రమంగా మద్యం రవాణా చేస్తే ఉపేక్షించం

హొళగుంద: ఎవరైనా అక్రమంగా మద్యం రవాణా చేస్తే ఉపేక్షించమని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన 27 వాహనాలకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వేలం ద్వారా వచ్చిన నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హొళగుంద, హాలహర్వి ఎస్ఐలు వల్లెపు శ్రీనివాసులు, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి బైబిల్ వేసవి తరగతులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఒమేగా సండే స్కూల్‌లో ఎంబీ ఎరుషలేము సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి మే 6వ తేదీ వరకు బైబిల్ వేసవి బడి తరగతులు నిర్వహిస్తున్నట్లు చర్చి పాస్టర్ జయన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వీబీఎస్ తరగతులుంటాయన్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే బైబిల్ నీతి కథలు, యాక్షన్ సాంగ్స్, బైబిల్ క్విజ్, గేమ్స్ నేర్పించనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

తుగ్గలి : మండల వ్యాప్తంగా సోమవారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్‌ఎం బాషా తెలిపారు. మండలంలోని 18 సచివాలయల పరిధిలో 7,590 పింఛన్ దారులకు గాను రూ.2,10,08,500 మంజూరైందన్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

ఆధ్యాత్మికం

● కొల్హాపురి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామ శివారులో ఉన్న కొల్హాపురి లక్ష్మీదేవి అమ్మవారికి శనివా రం ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం, అష్టోత్తరనామార్చన, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

● నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవ కార్యక్రమాలు శ్రీ భీమలింగేశ్వర స్వామి, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఆదివారం పూజారి శివయ్య ఆచారి తెలిపారు.

● వీరన్నగట్టు స్వాముల ఉరుసు

వెల్దుర్తి: స్థానిక వీరన్నగట్టుపై వెలసిన వన్నూర్‌షావలి, జలాలివల్లి స్వాముల ఉరుసు ఘనంగా జరిగింది. భక్తులు కొండపైకి చేరుకుని స్వామి వార్లతోపాటు వారి దాసుడైన వస్తకీమ్ అలీషా ఖలీఫా రఫాయి దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● ఆరాధనోత్సవాలు ప్రారంభం



కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపారాయణం, గురుపూజతో స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామికి కళ్యాణం నిర్వహించారు. ఆదివారం ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి గ్రామంలో ఊరేగిస్తారు.

పోలీసు డైరీ

దుకాణంలో చోరీ

ఎమ్మిగనూరు రూరల్: ఆదోని బైపాస్ రోడ్డులో వినయ్‌కుమార్‌కు చెందిన శ్రీ లక్ష్మీ ట్రేడింగ్ షాప్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. షాప్ వెనుకభాగంలో బండను పగులగొట్టి దుకాణంలోకి ప్రవేశించి రూ. 6,300 నగదును ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పక్క దుకాణాల యజమానులు గుర్తించి వినయ్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. ఆయన వెళ్లి పరిశీలించి చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం క్రితం మంత్రాలయం రోడ్డులో కూడా ఇదే తరహాలో చోరీ జరిగిందని, రాత్రిపూట పోలీసు గస్తీ పెంచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.